స్లాట్ బుకింగ్ నిబంధనలు తొలగించాలి



రంగారెడ్డి అర్బన్, జనవరి 12 : స్లాట్ బుకింగ్ నిబంధలను తొలగించి నేరుగా సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని దివ్యాంగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

జిల్లాలో భారీగా బదిలీలు

జడ్పీ సీఈవోలు, ఆర్డీవోలూ ● కీలక పోస్టులకు కొత్త అధికారులు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : ఉమ్మడి జిల్లాలోని పలుశాఖల్లో బదిలీల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం వివిధ శాఖల్లో మూకుమ్మడి బదిలీలు చేస్తుండగా మరికొన్ని శాఖల్లో పాలన సౌలభ్యం కోసం బదిలీలు చేస్తున్నారు. రంగారెడ్డి జడ్పీ సీఈఓ దిలీప్ కుమార్‌ను ప్రభుత్వం సోమవారం మేడ్చల్ జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో యాదాద్రి- భువనగిరి జిల్లా జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణారెడ్డిని నియమించింది. అలాగే వికారాబాద్ జడ్పీ సీఈఓ జానకీరెడ్డి సంగారెడ్డికి బదిలీ చేశారు. నిర్మల్‌లో పనిచేస్తున్న సుధీర్‌ను వికారాబాద్ సీఈఓగా నియమించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో కూడా భారీగా బదిలీలు జరిగాయి. డిప్యూటీ కమిషనర్లతో పాటు అసిస్టెంట్ కమిషనర్లు, ఇన్‌స్పెక్టర్లను పెద్ద సంఖ్యలో బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డేవిడ్ రవికాంత్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న వి.దశరథ్‌ను రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ కిషన్‌ను రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీగా నియమించారు. నగర శివార్లలోని కీలక రెవెన్యూ పోస్టులపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో నియమించిన అధికారులందరినీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తోంది. ఇటీవలే రెవెన్యూలో మార్పులు చేర్పులు చేపట్టిన ప్రభుత్వం ఎంపీడీఓలను కూడా మూకుమ్మడిగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాజేంద్రనగర్ ఆర్డీఓను బదిలీ చేశారు. ఈ స్థానంలో హైదరాబాద్ యూఎల్‌సీలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఉపేందర్‌రెడ్డిని నియమించారు. ఉపేందర్‌రెడ్డి గతంలో ఉమ్మడి జిల్లాలో పనిచేశారు. అలాగే కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్‌పై బదిలీ వేటు వేశారు. ఆయన స్థానంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఎల్. రమాదేవిని ఆర్డీఓగా నియమించారు. అయితే మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ కంటే సీనియరైన రమాదేవిని ఆర్డీఓగా నియమించడం చర్చనీయాంశంగా మారింది. రమాదేవి గతంలో ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. ఇక జహీరాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్న కె.వెంకారెడ్డిని శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా నియమించారు.

రూ. 46 లక్షల విలువైన 173 కిలోల గంజాయి పట్టివేత

● మహేశ్వరం, చేవెళ్లల్లో స్వాధీనం

● ఐదుగురి అరెస్టు, పరారీలో మరో ఆరుగురు



చేవెళ్లలో పట్టుబడిన గంజాయి, నిందితులు

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12: మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం పోలీసులు ఆదివారం శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.30లక్షలు ఉంటుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సోమవారం తెలిపారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని తెలిపారు. లోకేష్, రాహుల్ గంజాయి వ్యాపారం చేస్తుంటారని, రాకేశ్‌రెడ్డి, చంటిబాబు మధ్యవర్తులుగా ఉంటూ ఆటోలో గంజాయి తరలిస్తారన్నారు. మరో ఘటనలో సోమవారం చేవెళ్లలో పోలీసులు గంజాయి ముఠా నుంచి రూ.16 లక్షల విలువైన 64కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్‌మోహితి, నౌనాథ్ గణ్పత్‌చౌహాన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాష్‌మొహితే, రేఖ, మనోజ్‌సింగ్‌పీ, లాము పాలాటీ గంజాయిని ఒడిశాలోని బ్రహ్మపూర్ నుంచి తెచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుంటారు. మహారాష్ట్రలో ఎక్కువ ధరకు గంజాయి అమ్మేందుకు నగరం నుంచి బయల్దేరారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చౌరస్తాకు చేరుకొని గంజాయితో ముగ్గురు పట్టుకోగా నలుగురు పారిపోయారు. వారి నుంచి 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణ్పత్, మాధన్‌లను రిమాండ్‌కు తరలించారు.

కొలత.. కలత!

● సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్ పోస్టులు ఖాళీ

● జిల్లాలో భూముల సర్వేకు ఇబ్బందులు

● రెండు మండలాలకు ఒక్కరే సర్వేయర్

● పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలు

● కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

జిల్లాలో భూములకు రెక్కలొచ్చాయి. దీంతో పాటే భూ వివాదాలూ పెరిగిపోయాయి. ఇవి ఘర్షణలకు కూడా దారితీస్తున్నాయి. భూముల హద్దుల పంచాయితీలను అరికట్టేందుకు కొలతలు చేపట్టాలంటే సర్వేయర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. సర్వేయర్లు లేకపోవడంతో భూ కొలతలు పెండింగ్‌లో ఉంటున్నాయి. అనేక మంది రైతులు కొలతల కోసం ఫీజులు చెల్లించి సర్వేయర్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో సర్వేయర్ల కొరత రైతులకు శాపంగా మారింది.

భూముల సర్వేకు సిబ్బంది, సర్వేయర్ల కొరత

ఉండాల్సిన సర్వేయర్లు :	27
ఉన్న సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు :	14
ఖాళీలు :	13

జిల్లా సర్వే కార్యాలయంలో..

ఉండాల్సిన ఉద్యోగ సిబ్బంది :	30
ప్రస్తుతం ఉన్నది :	18
ఖాళీలు :	12


వచ్చిన దరఖాస్తులు	పరిష్కరించినవి	పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
1,900	285 (శాతం 13)	1,615

14 గ్రామాలకు నో.. సేత్వార్!

జిల్లాలో 601 రెవెన్యూ గ్రామాల పరిధిలో 575 విలేజ్ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 545 మ్యాప్‌లను పరిశీలించి, వాటిని ధరణిలో నమోదు చేయించారు. కానీ, ఏడు గ్రామాలకు సంబంధించిన మ్యాప్‌లు మిస్సయ్యాయి. మొత్తం జిల్లాలో 1,67,550 సర్వే నెంబర్లు, 1,12,858 టీపన్లు, 372 సేత్‌వార్లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 14 గ్రామాల్లో సేత్‌వార్‌లు లేవు. ఈ గ్రామాల్లో రీ సర్వే చేశారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సురేష్. అమీర్‌పేట్‌లో ఉంటున్నాడు. శంకర్‌పల్లి మండలం సింగాపురం గ్రామ శివారులో ఎకరం నాలుగు గుంటల పొలాన్ని కొనుక్కున్నాడు. కొన్న భూమిని సర్వే చేయించేందుకు మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు చేసుకుని ఏడాది అవుతున్నా.. ఇప్పటి వరకు సర్వేయర్ రాలేడు. అతని భూమిని సర్వే చేయలేదు. ఏడాది నుంచి తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి తన భూమిని సర్వే చేయించాలని కోరుతున్నాడు.



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లాలో కొలతల సార్ల కొరత ఏర్పడింది. ఫలితంగా భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య పెరిగిపోతోంది. సర్వే ల్యాండ్ రికార్డ్ విభాగంలో పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కీలకమైన సర్వేయర్లతో పాటు డిప్యూటీ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో సరిహద్దు పంచాయతీలు తెగడం లేదు. భూ వివాదాలు కొలిక్కి రావడం లేదు. భూముల ధరలు పెరిగిన కొద్దీ వివాదాలు పెరుగుతున్నాయి. సరిహద్దు సమస్యలతో సర్వే కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్వేయర్లు, సిబ్బంది కొరతతో నెలల తరబడి కొలతలకు అధికారులు రావడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూముల సర్వే కోసం రైతులు రుసుము చెల్లించి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సంబంధించి భూముల కొలతలకు వెళ్లకుండా డబ్బులిచ్చిన వారి భూముల వద్దకు వెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని 27మండలాలకు 27మంది సర్వేయర్లు ఉండాలి. కానీ, ప్రస్తుతం 9మంది సర్వేయర్లు, ఐదుగురు డిప్యూటీ సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాల బాధ్యతలు అప్పగించారు. సర్వేయర్ల కొరత కారణంగా ఐకేపీలో పనిచేస్తున్న ముగ్గురిని సర్వేయర్లుగా విధులోకి తీసుకున్నారు. కందుకూరు, మంచాల, మొయినాబాద్ మండలాల్లో ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ మూడు మండలాల్లో సర్వేయర్లుగా పనిచేస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు కొత్తగా సర్వేయర్ల నియామకం చేపట్టకపోవడంతో సర్వే సమస్య తలెత్తుతోంది. చైన్‌మన్లు, సర్వేయర్లు, సీనియర్ సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. గతంలో ప్రభుత్వ భూములు కొలిచేందుకు ప్రత్యేక సర్వేయర్లు ఉండేవారు. కాలక్రమేణ వారు రిటైర్డ్ కావడంతో కొత్తవారిని తీసుకోలేదు. భూముల కొతల్లో వచ్చిన తేడాలను గుర్తించి సరిచేసేందుకు సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు సకాలంలో కొలతలు వేసేందుకు సర్వేయర్లు ఎప్పుడు వస్తారో తెలియక నెలల తరబడి నిరీక్షిస్తూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దశాబ్దకాలంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భూ క్రయ, విక్రయాలు పెరిగిపోయాయి. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత దస్త్రాలు, భూ కొలతల్లో చాలా వ్యత్యాసాలు వస్తున్నాయి. కొందరికి రికార్డుల్లో భూమి ఎక్కువ ఉంటే.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే భూ విస్తీర్ణం తక్కువగా ఉంటోంది. మరికొందరికి భూమి తక్కువగా ఉంటే రికార్డుల్లో ఎక్కువ చూపిస్తోంది. ఫలితంగా కమతాల హద్దుల పక్కనే ఉన్న రైతుల మధ్య వివాదాలు ప్రారంభమై ఘర్షణలకు దారి తీస్తోంది. భూముల కొనుగోలు సమయంలో ఈ తేడాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో కొనుగోలు చేసిన వారు తాము ఖరీదు చేసిన దానికంటే కమతం తక్కువగా ఉందని, అధికారికంగా సర్వే చేయాలంటూ రెవెన్యూ, భూ కొలతల శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అవసరాల మేర భూమి కొలతల అధికారులు, ఇతర సిబ్బంది లేకపోవడంతో కొలతల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. సిబ్బంది అందుబాటులో లేరనే కారణంతో సర్వేను వాయిదా వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,900 దరఖాస్తులు రాగా అందులో 13శాతం మాత్రమే పరిష్కారమయ్యాయి. మిగతా 87 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయి. అసలే సర్వే అధికారుల కొరత ఉందంటే పనిభారం అధికంగా ఉంటోంది. రైతుల దరఖాస్తులతో పాటు జాతీయ రహదారుల కోసం భూసేకరణ కోసం భూముల కొలతలు వేసే బాధ్యత వీరిపైనే ఉంది. సాంకేతిక పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కొలతల కోసం వచ్చే దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో అలస్యమవుతోంది.

జిల్లా కార్యాలయంలో...

జిల్లా సర్వే కార్యాలయంలో ఉద్యోగ సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. 30మంది ఉద్యోగ సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 18 మంది విధులు నిర్వహిస్తున్నారు. 12 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలోని అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) కార్యాలయంలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. వీరు పూర్తిగా మండల సర్వేయర్లపైనే ఆధారపడుతున్నారు. ఏడీ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. మండల స్థాయిలో పరిష్కారం కాని వివాదాస్పద భూముల సర్వేకు అధికంగా ఫిర్యాదులు ఏడీ వద్దకు వస్తున్నాయి. ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. అయితే, జిల్లాలో ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో ఆ పనులు సైతం ఏడీ చేయాల్సి వస్తుంది. ఫలితంగా రైతుల సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూ సర్వే కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, రిపోర్టుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిహద్దులు నిర్ణయించడంలో జాప్యం చోటు చేసుకుంటుంది. దీంతో విలువైన భూములు కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్తున్నాయి.

ఎప్పటికప్పుడు కొలతలు వేస్తున్నాం



మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సర్వేయర్ల కొరత కారణంగా కొంత ఆలస్యం జరుగుతుంది. జిల్లాలో 27 మండలాలకు గాను 14 మంది సర్వేయర్లు ఉన్నారు. మిగతా మండలాల్లో సర్వేయర్లు లేరు. అయినప్పటికీ సర్దుబాటు చేస్తున్నాము. ఒక సర్వేయర్‌కు రెండు మండలాలను అప్పగించాం. సర్వేయర్లకు పనిభారం ఎక్కువగా ఉన్నప్పటికీ... పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కంచేందుకు చర్యలు తీసుకుంటున్నాను.

-కె. శ్రీనివాసులు, లాండ్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్

సర్వే కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను



నాకు 18 ఎకరాల పొలం ఉంది. 13 గుంటలు తక్కువగా వస్తుంది. దీంతో సర్వేకోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాను. రెండేళ్లు అవుతున్నా.. ఇప్పటి వరకు సర్వేయర్ రాలేదు. నా భూమి కొలవలేదు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మళ్లీ వారం క్రితం ఆన్‌లైన్‌లో సర్వేకోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడైనా నా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

కురువ మల్లేష్, రైతు, కాసులబాద్, జిల్లేడు చౌదరిగూడ మండలం

ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే చేయించుకున్నా



ప్రభుత్వ సర్వేయర్ కోసం ఏడాది ఎదురుచూసి చివరకు ప్రైవేట్ సర్వేయర్‌తో భూమి సరిహద్దులు సర్వే చేయించుకున్నాను. ప్రభుత్వ సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే చేయించుకోవాల్సి వస్తుంది. ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే చేయిస్తే.. రికార్డుల్లో ఉన్న దాని కంటే పొజిషన్‌లో తక్కువగా చూపిస్తుంది. దీంతో విలువైన భూమిని కోల్పోవాల్సి వస్తుంది.

గురుగు రాజు, మొయినాబాద్

సర్వే కావడం లేదు



ఏడాది క్రితం సర్వే కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాను. సర్వే నెంబర్ 84లో 15 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించి ఏళ్ల తరబడి వివాదం ఉంది. సమస్యను పరిష్కరించుకునేందుకు సర్వేకు పెట్టాం. ఏడాది అవుతన్నా ఇప్పటి వరకు సర్వేయర్ రాలేదు. సర్వే చేయలేదు. భూ వివాదం అలాగే ఉంది. త్వరగా సర్వే చేయాలి.

షాపురం మాణిక్యం, రెడ్డిపల్లి గ్రామం

ఈ పాఠశాలకు 150 వసంతాలు

● ఎంతోమంది జీవితాలను మార్చిన మొగిలిగిద్ద పాఠశాల

● దివంగత సీఎం బూర్గుల రామకృష్ణారావు, మాజీ గవర్నర్ దివంగత సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ ఈ పాఠశాల విద్యార్థులే

● వేడుకలకు సిద్ధమవుతున్న పూర్వ విద్యార్థులు

మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల



షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 12: నవాబుల కాలంలో ఏర్పాటు చేసిన ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆహ్వాన సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. చరిత్రాత్మకమైన మొగిలిగిద్ద పాఠశాలను నాటి నవాబుల కాలంలో నిర్మించారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో నాడు నిజాం నవాబుపై బాంబు వేసి తప్పించుకునే ప్రయత్నంలో తుర్రేబాజ్‌ఖాన్ అనే యోధుడు బెంగళూరు వెళ్తూ మార్గమధ్యలో ఉన్న మొగిలిగిద్దలో ఆశ్రయం పొందినట్లు తెలుసుకున్న నవాబు అతడిని బంధించి హైదరాబాద్ తీసుకెళ్లి చంపినట్లు చెప్పుకుంటారు. దీంతో మొగిలిగిద్దలో నవాబులకు వ్యతిరేకంగా కార్యకలాపాలు జరుగుతున్నాయని అనుమానించిన నవాబులు భవిష్యత్తులో తమపై కుట్రలు జరుగుతాయని భావించి పిల్లలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు చేయకుండా వారిని చదువు వైపు మళ్లించేందుకు మొగిలిగిద్దలో పాఠశాలను ఏర్పాటు చేసినట్టు ఇక్కడ ప్రజలు చెప్పుకుంటారు.

1873లో పాఠశాల ఏర్పాటు...

మొగిలిగిద్దలో నాటి నవాబులు 1873లో పరిగి రోడ్డు పక్కన పాఠశాలను ఏర్పాటు చేశారు. అనంతరం సమాచార వ్యవస్థ కోసం పోస్టాఫీసు, శాంతి భద్రతల కోసం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. నాడు ఏర్పాటు చేసిన పాఠశాల మొగిలిగిద్ద ప్రజలనే కాకుండా పరిసర గ్రామాల విద్యార్థుల జీవితాలను మార్చివేసింది. ఈ పాఠశాలలో చదివిన వారు దేశ, విదేశాల్లో డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, అనేక రంగాల్లో స్థిరపడ్డారు. అంతే గాకుండా హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన ఫరూఖ్‌నగర్ అన్నారం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి, ప్రముఖ హక్కుల ఉద్యమ కారుడు ప్రొఫెసర్ హరగోపాల్ వంటి మేధావులు ఈ పాఠశాలలోనే చదువుకున్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ స్వగ్రామం మొగిలిగిద్దనే. డాక్టర్లుగా విదేశాల్లో సైతం వైద్య సేవలు అందిస్తున్న బోడంపాడు గ్రామానికి చెందిన డాక్టర్ బాలు మొగిలిగిద్ద వాసి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యేగా, టి. అంజయ్య ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన శ్రీనివాసరావులు కూడా ఈ పాఠశాల విద్యార్థులే. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కూడా మూడవ తరగతి వరకు మొగిలిగిద్దలోనే చదివినట్లు ఇక్కడి ప్రజలు చెప్పుకుంటారు. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉండి ఆయన ఇక్కడ చదువుకున్నట్లు చెప్పుకుంటారు. అందుకే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో షాద్‌నగర్ బస్టాండ్‌ను ప్రారంభించి రేగడి చిల్కమర్రి వరకు బస్సులో ప్రయాణిం చారని చర్చించుకుంటారు. 1873లో స్థాపించిన మొగిలిగిద్ద పాఠశాల వందేళ్ల ఉత్సవాలను 1973లో జరుపుకున్నారు. ఆ వేడుకలకు నాటి ఆర్థిక శాఖ మంత్రి ఎన్. రాంచంద్రారెడ్డితో పాటు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ కేకే రెడ్డి హాజరయ్యారు.

150 ఏళ్ల వేడుకలకు ఏర్పాట్లు

150 వసంతాల వేడుకలకు పూర్వ విద్యార్థులను అందరినీ ఆహ్వానించేందుకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఏర్పాట్లపై రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా జి.శ్యాంసుందర్, గౌరవ కార్యదర్శిగా మురళి, అధ్యక్షుడిగా రాధాకృష్ణ, కార్యదర్శిగా ఆనందీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా గంగాధర్‌లను ఎన్నుకున్నారు.


ఉపాధ్యాయుల అంకితభావంతోనే ఎదిగాం



ఉపాధ్యాయుల అంకిత భావంతోనే ఉన్నత చదువులు చదవగలిగాం. నేను 1956 నుంచి 1964 వరకు హెచ్‌ఎస్‌సీ పూర్తి చేశాను. నాది పాఠశాలలో నాలుగో బ్యాచ్. మా ముందు బ్యాచ్‌లో హర గోపాల్ చదివారు. స్కూలు వదిలిన తర్వాత ఎల్లంపల్లికి పోయి సాయంత్రం భోజనం చేసి మళ్లీ స్కూల్‌కు వచ్చేవాళ్లం. రాత్రంతా స్కూల్‌లోనే చదువుకునే వాళ్లం. రాత్రి 11 గంటలకు ఉపాధ్యాయులు వచ్చి చెక్ చేసేవాళ్లు. ఉపాధ్యాయులకు మా పిల్లలు అనే బాధ్యత ఉండేది. నా ఎదుగుదలకు కారణం మొగిలిగిద్ద పాఠశాలనే.

- మహాత్మారెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ, ట్రాన్స్‌కో


ఇది మా సరస్వతీ నిలయం



మొగిలిగిద్ద పాఠశాల ఓ సరస్వతీ నిలయం. పేదవారి నుంచి ఉన్నత కుటుంబాలకు సమాన విద్య అందించిన పాఠశాల. ఆ పాఠశాలలో ఎంతోమంది నేడు దేశ, విదేశాల్లో స్థిర పడ్డారు. మా పాఠశాల 150 ఏళ్ల పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది.


- ప్రొఫెసర్ హరగోపాల్

వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు



మొగిలిగిద్ద పాఠశాల 150 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే చాలామంది పూర్వ విద్యార్థులు తమ సమ్మతి తెలిపారు. త్వరలో వేడుకల తేదీ ప్రకటిస్తాం.

- శ్యాంసుందర్, వేడుకల కమిటీ గౌరవాధ్యక్షుడు



వందేళ్ల వేడుకల శిలాఫలకం

సీసీ రోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరు

ధారూరు, ఫిబ్రవరి 12: జాతీయ ఉపాధిహామీ పథకం కింద సీసీరోడ్ల నిర్మాణానికి మండలానికి 48పనులకు రూ.2.50కోట్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు సీసీరోడ్ల పనులను గ్రౌడింగ్ పూర్తిచేస్తామని ఆయన చెప్పారు. ధారూరుకు రూ.10లక్షలు, లక్ష్మీనగర్ తండాకు రూ.5లక్షలు, తిమ్మానగర్‌కు రూ.5లక్షలు, చింతకుంటకు రూ.5లక్షలు, హరిదాసుపల్లికి రూ.5లక్షలు, ఎబ్బనూర్‌కు రూ.5లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కొండాపూర్ గ్రామానికి రూ.10లక్షలు, కేరెల్లికి రూ.5లక్షలు, బాచారం గ్రామానికి రూ.5లక్షలు, నాగ్‌సాన్‌పల్లికి రూ.5లక్షలు, తరిగోపులకు రూ.10లక్షలు, మైలారం గ్రామానికి రూ.5లక్షలు, అల్లీపూర్‌కు రూ.5లక్షలు, మున్నూర్‌సోమారం గ్రామానికి రూ.10లక్షలు, కొండాపూర్‌కలాన్‌కు రూ.5లక్షలు, నర్సాపూర్‌కు రూ.5లక్షలు, గడ్డమీదిగంగారం గ్రామానికి రూ.5లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కుక్కిందకు రూ.10లక్షలు, అవుసుపల్లికి రూ.5లక్షలు, నాగసమందర్‌కు రూ.15లక్షలు, అల్లాపూర్‌కు రూ.5లక్షలు, రుద్రారంకు రూ.5లక్షలు, గట్టేపల్లికి రూ.10లక్షలు, కుమ్మర్‌పల్లి తండాకు రూ.5లక్షలు, ధర్మాపూర్‌కు రూ.5లక్షలు, రాంపూర్‌కు రూ.10లక్షలు, స్టేషన్ ధారూర్‌కు రూ.10లక్షలు, దోర్నాల్‌కు రూ.10లక్షలు, పీసీఎం తండాకు రూ.5లక్షలు, అంపల్లికి రూ.5లక్షలు, గురుదోట్లకు రూ.5లక్షలు, రాజాపూర్‌కు రూ.5లక్షలు, మెమిన్‌ఖుర్దుకు రూ.5లక్షలు, మోమిన్‌కలాన్‌కు రూ.10లక్షలు, అంతారం గ్రామానికి రూ.5లక్షలు, నాగారంకు రూ.15లక్షలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు ఆయన వివరించారు.

ఎమ్మెల్సీ, జడ్పీచైర్‌పర్సన్‌కు సన్మానం



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ మాజీచైర్మన్ విశ్వనాథ్‌గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 12: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డిని సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ యువ నాయకులు సోమనాథ్‌గౌడ్, సుభాన్‌రెడ్డి తదితరులు కలిసి శాలువాతో సన్మానించారు. విశ్వనాథ్‌గౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఆయన తిరిగి సొంతగూటికి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజేందర్‌గౌడ్

ధారూరు, ఫిబ్రవరి 12: ధారూరుకు చెందిన బీజేపీ నాయకుడు రాజేందర్‌గౌడ్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేరుస్తానన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి, సహకరించిన నాయకులు శివరాజ్, కేపీ రాజు, వివేకానందరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

'పట్నం' మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంలో నెలకొన్న సస్పెన్స్

● క్యాంపును వీడిన ఇరువురు కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై సభ్యులు పెట్టిన అవిశ్వాసంపై సస్పెన్స్ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ఆమె అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 24 మంది కౌన్సిలర్లకుగాను 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 16న అవిశ్వాసానికి సంబధించి కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి జిల్లా కలెక్టర్ అనుమతినిచ్చారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి ఈ సమావేశం ఏర్పాటు చేస్తారు. కాగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలు చేసిన ఇరువురు కౌన్సిలర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారిలో పదవ వార్డు కౌన్సిలర్ పి.శంకరయ్య ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం నుంచి ఆయన అందుబాటులో లేరు. బీఆర్ఎస్‌కు చెందిన 24వ వార్డు కౌన్సిలర్ జెర్కోని బాల్‌రాజ్ కూడా క్యాంపును వీడి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో అవిశ్వాసంపై సస్పెన్స్ నెలకొంది. 24 మంది సభ్యులలో 16 మంది సభ్యులు హాజరై చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తేనే అవిశాసం నెగ్గుతుంది. కానీ తాజాగా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. అసలు ఏం జరుతుందోనని మున్సిపల్ ప్రజలు ఉత్కంఠతతో ఉన్నారు.

జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలకు సన్మానం

వికారాబాద్, ఫిబ్రవరి 12 : బదిలీపై వెళ్లనున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణిని జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు జిల్లాకు అందించిన సేవలను ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



అశోక్ (కుడి వైపు చివరన) ఉన్న వ్యక్తి

వికారాబాద్, ఫిబ్రవరి 12 : హైదరాబాద్‌లో జరిగిన 5వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో వికారాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు అథ్లెట్లు సత్తా చాటారు. గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో నడక విభాగంలో అథ్లెట్లు శ్రీనివాస్, నరేష్ బంగారు, వెండి పతకాలు సాధించగా, హ్యామర్‌త్రో విభాగంలో బార్వాద్ అశోక్ కాంస్య పతకం సాధించారు. కాగా ఇటీవ జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ అశోక్ రాణించాడు. కోట్‌పల్లి మండలం, బార్వాద్ గ్రామానికి చెందిన ఆయన వికారాబాద్ మండలం, బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ పోటీలకు ఎంపికయ్యాడు. పలువురు అభినందించారు.

రైతు సంక్షేమానికి మోదీ పెద్దపీట

మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మునుపెన్నడూ లేని విధంగా దేశంలో అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ మోదీ చరిత్రలో నిలిచిపోతారని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పది సంవత్సరాల పాలనలో కేంద్రం అమలు చేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను రైతులకు వివరించేందుకు చేపట్టిన గ్రామ పరిక్రమ యాత్ర ఉత్తరప్రదేశ్ నుంచి ప్రారంభమైన సందర్భంగా ప్రత్యక్షప్రసారాన్ని సోమవారం మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, పాపయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, పోతర్ల సుదర్శన్ యాదవ్, నాగారం ఎంపీటీసీ కె. వెంకటేష్, వెంకటేష్ గౌడ్, అశోక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థులకు గోల్డ్‌మెడల్


ట్రోఫీతో కరాటే విద్యార్థులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 12 : అంతర్జాతీయ కరాటే పోటీలలో మండలానికి చెందిన సోను కరాటే అకాడమి విద్యార్థులు సత్తా చాటారు. ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌తో పాటు చాంపియన్‌షిప్ సాధించారు. హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో మూడవ అంతర్జాతీయ ఓపెన్ ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి.పాల్గొన్నారు. చరణ్, దార్విక, అవోకర్, చర్రి, పూజ, ప్రణవి, పూజిత, రితికలు గోల్డ్‌మెడల్స్, సిరి, యాసిన్, అక్షిత, పూజ, శ్రీ నిహారిక, భువనేశ్వరిలు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు మాస్టర్ సోను చెప్పారు.

గోల్ఫ్ సెమీస్‌లో హైల్యాండర్స్, డీఎస్ఆర్ జట్లు

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సీజన్-4లో విలేజియో హైల్యాండర్స్, డీఎస్ఆర్, సామఏంజెల్స్, టీమ్‌ఆల్ఫా జట్లు సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. వికారాబాద్‌లోని ఊటీ గోల్ఫ్ కౌంటీలో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మేవరిక్స్‌పై హైల్యాండర్స్, టిరూట్స్‌పై ఏంజెల్స్, రైడర్స్‌పై ఆల్ఫా, టీమ్ క్లేమ్‌పై డీఎస్ఆర్ జట్టు గెలిచి, టైటిల్‌కు చేరువయ్యాయి. సెమీస్ మ్యాచ్‌లు ఊటీ గోల్ఫ్ కౌంటీలోనే జరగనున్నాయి. ఫైనల్ దుబాయ్‌లో జరగనుంది.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

● ఘనంగా తల్లిదండ్రుల పూజా కార్యక్రమం


పాదపూజ చేస్తున్న విద్యార్థులు

షాబాద్, ఫిబ్రవరి 12 : తల్లిదండ్రులను మించిన దైవం లేదని సంత్ ఆశారాం బాపూజీ ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ అమర్‌నాథ్, పరమేశ్వర్‌లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో సంత్ ఆశారాం బాపూజీ ఆశ్రమం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్, పరమేశ్వర్ మాట్లాడుతూ పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించాలని, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని విద్యార్థి దశ నుంచే వివరించాలన్నారు. యువత పెడదారి పట్టకుండా 18 సంవత్సరాలుగా తల్లిదండ్రులకు పూజా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

● ఆరు రోజుల పాటు ఉత్సవాలు

● భక్తులకు వసతుల కల్పన

కడ్తాల్, ఫిబ్రవరి 12 : మండలం పరిధి మక్తమాదారంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం అవుతాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం (నేటి) నుంచి ఈ నెల 18 వరకు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఆరు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు.


మక్తమాదారం శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం

ఈ నెల 20 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రతీ ఏటా జరిగే బ్రహ్మోత్సవాలను ఆలయ నిర్వాహకులు ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహించబోతున్నారు. అందు కోసం దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. ప్రముఖ అర్చకుడు మెళ్లూరి వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఏడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్ టి. వేణుగోపాల్, ఈవో మోహన్‌రావు తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు తిరునగరి వెంకటేశ్, తిరునగరి శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణలు కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షికబ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోరారు. ఈ దేవాలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, నాయకులు బ్రహ్మచారి, పాలాది ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, యాదయ్య గౌడ్, జంగారెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సాయిరెడ్డి, హన్మనాయక్, శేఖర్ రెడ్డి, బిక్కునాయక్, రవీందర్ రెడ్డి, సోమయ్య, క్యామ రాజేశ్, అశోక్‌రెడ్డి, తరుణ్, జగదీశ్, సక్రు, సేవ్య, పాండు,అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ, పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో శ్రీ భక్తమార్కండేయ జయంతి


భక్త మార్కండేయ స్వామి డోలారోహణం

ఆమనగల్లు : పట్టణంలోని గుర్రంగుట్టపై గల మార్కండేయస్వామి దేవాలయంలో శ్రీ భక్తమార్కండేయ స్వామి జయంతి వేడుకలను సోమవారం మండల, మహిళా, యువజన పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు సమీప గ్రామాల భక్తులు, పద్మశాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పద్మశాలి సంఘం మండల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. అర్చకులు భూషణ్ , శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. మహిళలు స్వామి వారికి డోలారోహణం నిర్వహించారు. పట్టణానికి చెందిన గుజ్జరి ప్రవీణ్‌స్రవంతి ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు అప్పం శ్రీను, ఎంగిళి బాలకృష్ణ, గాజుల శ్రీను, పాలాది శ్రీను, చెర్కు రవి, మామిడి శెట్టి రవి, ఎంగిళి యాదగిరి, అప్పి, చంద్రమౌళి, అప్పం అలివేలు, శ్రీలత, చెర్కు విజయ పాల్గొన్నారు.

చెల్లిని ప్రేమిస్తున్నాడని యువకుడి కిడ్నాప్

● బైక్‌లపై స్నేహితులతో వచ్చి ఎత్తుకెళ్లిన బాలిక అన్న

● యువకుడిని చితకబాదిన వైనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12 : చెల్లిని ప్రేమిస్తున్నాడనే కక్షతో అన్న ఓ యువకుడ్ని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన సంఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌పట్టణం, సూర్యనగర్‌కు చెందిన సూరిమళ్ల ఉదయ్‌రాజ్ (23) ఈనెల 8న పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్న తన స్నేహితులైన పృధ్వీ, చైతన్య వద్దకు వచ్చాడు. కాగా ఈనెల 10న నిజామాబాద్ సూర్యనగర్‌కు చెందిన తనుష్ మరో ముగ్గురు స్నేహితులతో రెండుబైక్‌లపై సంస్కృతిటౌన్‌షిప్‌కు వచ్చి ఉదయ్‌రాజ్‌ను కిడ్నాప్ చేశాడు. అక్కడి నుంచి మల్కాజ్‌గిరిలో ఓ గదికి తీసుకెళ్లి ఉదయరాజ్‌పై దాడిచేశారు. అనంతరం బోల్లారానికి తీసుకెళ్లి చితకబాదారు. కిడ్నాప్ విషయం తెలియగానే పోచారం ఐటీసీ పోలీసులు నాలుగు బృందాలుగా రంగంలోకి దిగారు. పోలీసులు గాలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తనుష్ అతన్ని తార్నాకలో అర్ధరాత్రి వదిలిపెట్టి పరారయ్యారు. పోలీసులు ఉదయ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని వైద్యం అందించారు. ఉదయ్‌రాజ్ నిజామాబాద్‌లో తనుష్ చెల్లిని ప్రేమించడానే కక్షతో కిడ్నాప్‌కు పాల్పడి, దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు రోజులుగా డాక్టర్లు లేకుండానే వైద్య సేవలు

● అన్నీ తామై నిర్వహిస్తున్న నర్సులు

● ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బషీరాబాద్, ఫిబ్రవరి 12: ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందని సంఘటన సోమవారం బషీరాబాద్ పీహెచ్‌సీలో వెలుగుచూసింది. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ రెండు రోజులుగా నర్సులే అన్నీ తామై వైద్య సేవలందిస్తున్నారు. డాక్టర్. పవిత్ర రెగ్యూలర్ మెడికల్ అఫీసర్‌గా ఉండగా, డాక్టర్ శ్రీకాంత్, సురేష్ ఇద్దరు వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్. పవిత్రకు ఫ్యామిలీ ప్లానింగ్ జిల్లా అఫీసర్‌గా బాధ్యతలు అప్పగించడంతో మిగతా ఇద్దరు వైద్యులు విధులు కొనసాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వైద్యశాఖలో డిప్యూటేషన్లను రద్దు చేయడంతో డాక్టర్. శ్రీకాంత్ తాండూరు మండలంలోని జినుగుర్తి పీహెచ్‌సీకి తిరిగి వెళ్లిపోయారు. ఉన్న ఒక డాక్టర్. సురేష్ అత్యవసర పరిస్థితిలో సెలవు పెట్టడంతో వైద్యం అందించేవారే కరువయ్యారు. రెండు రోజులుగా వైద్యులు ఎవరూ కనిపించకపోవడంతో చేసేదేమిలేక అక్కడున్న నర్సులకు రోగం చెప్పుకొని వారిచ్చిన మందు బిల్లలు తీసుకెళ్తున్నారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్సలు పొందున్నారు. డాక్టర్లు లేకపోతే రోగులకు వైద్య సేవలేలా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వైద్య సేవాలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను, నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్, మోదీ

● సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితుడు

చల్లా వంశీచంద్‌రెడ్డి

కొందుర్గు, ఫిబ్రవరి, 12 : రైతులను, నిరుద్యోగులను కేసీఆర్, నరేంద్రమోడీలు మోసం చేశారని సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ చేస్తున్న న్యాయ్ యాత్రకు సంఘీభావంగా పాలమూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఆయన చేస్తున్న పాలమూరు న్యాయ్‌యాత్రను సోమవారం మండల పరిధిలోని చెర్కుపల్లిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెర్కుపల్లి గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. విశ్వనాథ్‌పూర్, పాత ఆగిర్యాల, ఆగిర్యాల, వెంకిర్యాల, తంగళ్లపల్లి గ్రామాల్లో యాత్రను నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కరెంటు బిల్లులు కట్టేవారే కాదని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే, విద్యుత్ బిల్లులు వసూలు చేయడం ప్రారంభించారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల లోపు కరంటు ఉచితంగా, రూ.500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను త్వరలోనే అందించనుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రతీ సంవత్సరం 2 కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారని, పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు.వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు.


చౌదరిగూడ : మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తా

షాద్‌నగర్ నియోజవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి, గెలిపించారని, అందువల్ల అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి సోమవారం పాలమూరు న్యాయ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పని సరిగా అమలు చేస్తుందని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్‌రెడ్డి గెలిస్తే, అభివృద్ధిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పనిచేస్తారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తంగళ్లపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాజనా ఖాళీ చేసి, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొత్తూరు మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాజు, నాయకులు గోవర్ధన్‌గౌడ్, కె రాములు గౌడ్, జితేందర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, బాబర్‌ఖాన్, జహంగీర్, పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణమేమైంది

చౌదరిగూడ : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎందుకు ఎందుకు చేపట్టలేదని వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆధరణ చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు. పాలమూరు న్యాయ యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి ఇంద్రనగర్,చౌదరిగూడ వరకు కొనసాగింది. అనంతరం చౌదరిగూడలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లేడ్ చౌదరిగూడ పేరుకే మండలం కానీ ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడం విడ్డూరమని అన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పాలన కొనసాగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపలిశంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ యాదమ్మ, వైస్ ఎంపీపీ అస్రా బేగం, మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, ఎంపీటీసీలు సత్యనారాయణరెడ్డి, రజిత, నాయకులు చంద్రశేఖర్, యాదయ్య, పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్ , ఫిబ్రవరి 12: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ భూములను పరిరక్షించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్ది సేపు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయానికి సంబంధించి 120, 130 సర్వే నెంబర్లలో కొంత భాగం భూమి ఆక్రమణకు గురైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిదంగా ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు, బోరు బావులు తోడుతున్నారని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులైన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుస్టేషన్ చేరుకొని సీఐ శివప్రసాద్‌కు భూముల ఆక్రమణలపై పిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, తిరునగరి వేణుగోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, ఆలయ నిర్వాహకుడు పాలాది ఆంజనేయులు, స్థానిక నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, కే.చందోజీ, గూడూరు జంగారెడ్డి, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్, బ్రహ్మచారి, వెంకట్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బిక్కునాయక్, రవీందర్ రెడ్డి, రాజేశ్, సేవ్య, సక్రు, జగదీశ్, తరుణ్, అశోక్‌రెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్

షాబాద్, ఫిబ్రవరి 12 : తెలంగాణ ఉద్యమకారుడు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మద్దూర్ మల్లేష్ త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నట్లు తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు గౌరవం లేదని, ప్రత్యేక తెలంగాణ కోసం మండలం నుంచి తాను ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశానని అన్నారు. చెన్నయ్య, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ టీంకు కిట్లు పంపిణీ

శామీర్‌పేట, ఫిబ్రవరి 12 : మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని క్రీడా పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్ జాతీయ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ టోర్నమెంటులో పాల్గొనే క్రీడాకారులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహ్మదాబాద్‌లో జరిగే 19వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 13 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి ఎంపికయ్యారని అసోసియేషన్ ఆర్గనైజర్ కూరపాటి రాజశేఖర్ చెప్పారు. ఎంపికైన టీంకు కోచ్, మేనేజర్‌గా శ్వేత, అశోక్‌కుమార్‌ల వెళతారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు అశోక్‌కుమార్, దయాల్, శేఖర్, వరలక్ష్మీ, సురేందర్, గోపాల్, పాల్గొన్నారు.

రేపు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు

● జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 12 : ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఎల్బీ స్టేడియానికి తీసుకు వెళ్లే ఏర్పాట్ల కోసం సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రంగారెడ్డి జిల్లాలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 883, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 506 మందికి నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. 14న సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన అభ్యర్థులు గచ్చిబౌలిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన అభ్యర్థులు అంబర్‌పేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు ఉదయం 8 గంటలకు రావలసిందిగా వారికి తెలపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆర్టీసీ బస్సులలో వారిని ఎల్బీస్టేడియంకు తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు జిల్లా విద్యశాఖ అధికారి సుశీందర్‌రావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరి దేవి, మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌రెడ్డి, స్థానిక రవాణా శాఖ అధికారి రఘునందన్‌గౌడ్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి :

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 149 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ శశాంక తోపాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● పాప్ సింగర్ స్మిత


మాట్లాడుతున్న పాప్ సింగర్ స్మిత

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 12 : బాలికలు చదువులో రాణిస్తూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాప్‌సింగర్ స్మిత అన్నారు. సోమవారం కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వికారాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 103 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు మురారి, చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, జిల్లా డిప్యూటీ డీఎమ్హెచ్వో రవీంద్రయాదవ్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, గౌరారం గోపాల్, వీరేశం, విజయలక్ష్మీ, రాధిక, లక్ష్మీ, స్రవంతి, శ్యామల పాల్గొన్నారు.

కొత్తగడి రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి


వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 12: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త గడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి వై గీత డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మతతత్వ విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామంలో కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు ఏకమై కార్పొరేట్, మతతత్వ విధానాలను, నిరసిస్తూ ఫిబ్రవరి 16 న సమ్మె చేయనున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీఐటీయు, సీపీఎం నాయకులు శేఖర్, ప్రకాష్, శ్రీదర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజక వర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు పాండురంగారెడ్డి, హరికృష్ణారెడ్డి, నవీన్, గణేష్, బాబయ్య, సుబ్బు, బాల్‌రాజ్, గోవర్ధన్, నారాయణరెడ్డి, రంజిత్‌కుమార్, అర్జున్, సుధాకర్, స్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించాలి

● కేంద్ర రీసెర్చ్ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అమీరుల్లా ఖాన్


అమీరుల్లా ఖాన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంజూర్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 12 : సామాజిక విలువలను కాపాడుకుంటూ విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలని కేంద్ర రీసెర్చ్ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అమీరుల్లా ఖాన్, సహాయత ట్రస్ట్ చైర్మన్ మంజూరు గౌరీలు సూచించారు. చాలెంజర్ ఇంటర్‌నేషనల్ పాఠశాలలో ఆదివారం రాత్రి జరిగిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సహాయత ట్రస్ట్ సీఈఓ అనిసుద్దీన్, ట్రెజరర్ గౌరీద్, ప్రిన్సిపాల్ పర్వీన్, మహ్మద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి


కొత్తూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ, టీఎన్‌టీయూసీ నాయకులు


యాచారం: తమ్మలోనిగూడలో కరపత్రాలు విడుదల చేస్తున్న సాగర్


కేశంపేటలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న టంగుటూరి నరసింహారెడ్డి


ఆమనగల్లులో భోజన కార్మికులతో మాట్లాడుతున్న రమ

యాచారం, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సాగర్ అన్నారు. సోమవారం యాచారం మండలం మాల్, తమ్మలోనిగూడ గ్రామాల్లో పర్యటించి బంద్‌పై ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ చట్టాలు తేవడంతో పేద, మధ్య తరగతి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ రద్దుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు శోభన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, పి.అంజయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : వివిధ రంగాల గ్రామీణ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశాలు, పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికే ఈ నెల 16న దేశవ్యాప్త గ్రామీణ కార్మికుల సమ్మె చేపడుతున్నామని తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిషత్ ఆవరణలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ విడుదల చేశారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలివ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్, ఎన్ఈపీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లును రద్దుచేయాలన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రామచంద్రయ్య, పారేశ్, రోశయ్య, జంగయ్య, రాములు, యాదయ్య, పద్మమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.

నందిగామ: అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త కార్మిక సమ్మె, భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ, టీఎన్‌టీయూసీ నాయకులు సాయిబాబ, యాదగిరిచారి, గణేష్, రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్తూరలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షకులకు, రైతులకు వ్యతిరేకంగా అనేక చట్టాలను తెచ్చి ప్రజల జీవితాలను ఆగం చేస్తోందన్నారు. కార్మికులకు 8గంటల పనిదినం కల్పించి, కనీస వేతనం రూ.30వేల జీతం ఇచ్చేలా చట్టం తేవాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, డీజిల్, పెట్రోల్‌లను జీఎస్టీ పరిధికి తేవాలన్నారు. సమ్మెలో ప్రజలందరూ పాల్గొని మద్దతివ్వాలని కోరారు.

ఆమనగల్లు: బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్లు, ప్రైవేట్ కంపెనీల కొమ్ము కాస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రమ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేసి ఉద్యోగులు, కార్మికులను రోడ్డు పాలుచేస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు ఎంఈవో కార్యాలయం వద్ద సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతంపై భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. రమ, భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య, శివశంకర్ హాజరయ్యారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర విధానాలను తిప్పికొట్టాలన్నారు. బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు పద్మ, గోజి, లక్ష్మణ్, అలివేలు పాల్గొన్నారు.

రూ.1.2కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం


మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 12 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం అని మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డి అన్నారు. మోహన్‌రెడ్డి సర్పంచ్‌గా ఇటీవలే పదవీ విరమణ పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం గ్రామస్తులు మాజీ సర్పంచ్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మల్లారెడ్డిగూడలో రూ.కోటీ 20లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేశాం అన్నారు. మండలంలోనే ఎక్కువ నిధులు సాధించాం అన్నారు. గ్రామంలో నూతనంగా పంచాయతీ, అంగన్‌వాడీ, డ్వాక్రాభవనాల నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు వేశాం అని తెలిపారు. మల్లారెడ్డిగూడ అనుబంధ ఎర్రోని కోటాలలో కొన్ని పనులు మిగిలిపోయాన్నారు. తనను గెలిపించిన ప్రజలందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో విఠలేశ్వర్‌జీ, ఎంపీటీసీ కావలి రవీందర్, మాజీ ఎంపీటీసీ ఎస్.పెంటారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, నాయకులు ఎం.మాధవరెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకరయ్య, మల్లేశ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేందర్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

'ఐఎంఆర్ ఆగ్రోఫుడ్స్'ను వెంటనే మూసివేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

పంజాగుట్ట, ఫిబ్రవరి11: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో జంతు వ్యర్థాలు, ఎముకలతో కల్తీ నూనె, పొడి తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమడుతున్న ఐఎంఆర్ ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమను మూసివేయాలని పరిసర గ్రామాలు, తండాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమతో భరించలేని దుర్వాసన వస్తోందని, క్రిమికీటకాలు తమపై దాడి చేస్తున్నాయని ప్రజలు వాపోయారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో కొర్ర బాలు, రమేష్, నర్సింహ, రామస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ జంగయ్య, సూర్యనాయక్ తమ గోడును వెళ్లబోసుకున్నారు. అప్పారెడ్డిపల్లిలోని సర్వే నంబర్ 93లో 'ఐఎంఆర్ ఆగ్రో ఫుడ్స్' పేరిట పశువుల దానా చేస్తామని ఫ్యాక్టరీ పెట్టారన్నారు. కానీ అందులో జంతు కళేబరాలు, ఎముకలతో నూనె తయారు చేస్తూ ప్రజారోగ్యంతో ఆడుకుంటున్నారన్నారు. రాజీవ్‌గాంధీనగర్ తండా, గుడితండా, సర్రేతండా, కత్రామ్‌తండా, కొలుకులపల్లి, మధునాపురం, పోలెపల్లి, చాటిమీదితండాల ప్రజలు దుర్వాసనతో రోగాల వారిన పడుతున్నారని, సాగు పనులకు కూలీలను పిలిచినా ఎవరూ రావడం లేదన్నారు. తాము గతంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే ఫ్యాక్టరీని మూసివేయించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీని మూసేయించకుంటే విషంతాగి చస్తామని హెచ్చరించారు.

విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించాలి

యాచారం, ఫిబ్రవరి 12: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించాలని ఎంపీపీ సుకన్యబాషా అన్నారు. వికారాబాద్ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో విజయలక్ష్మిని సోమవారం ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది, పీఎస్‌లు, ప్రజాప్రతినిధులు మండల పరిషత్‌లో సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండల ప్రగతి కోసం ఎంపీడీవో తన వంతు కృషిచేశారన్నారు. ఉన్నతాధికారి హోదాతో తిరిగి జిల్లాకు రావాలని ఆకాంక్షించారు. పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వర్తింపజేసేలా ఎంపీడీవో ఎంతో చొరవ తీసుకున్నారని ఎంపీపీ కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి పాల్గొన్నారు.


ఎంపీడీవో విజయలక్ష్మిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో ప్రగతి


మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాల్‌రాజ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 12: రాజకీయ జీవితంలో సర్పంచ్ పదవి తొలిమెట్టు అని మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాల్‌రాజ్‌లు అన్నారు. ప్రజాప్రతినిధులు తమ పదవీ కాలంలో చేసిన మంచి పనులే వారి పేరును చిరస్థాయిగా నిలుపుతాయని పేర్కొన్నారు.ఆమనగల్లు, కడ్తాల, కల్వకుర్తి, వెల్దండ, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పదవీ విరమణ చేసిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమవారం సీకేఆర్ గార్డెన్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను మాజీ ఎమ్మెల్యేలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విరమణ పదవికే కానీ ప్రజాసేవకు కాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలోనే గ్రామాల్లో అద్భుత ప్రగతి సాధించామని చెప్పారు. ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు సాగించాలని జైపాల్, బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండలో నిర్వహించే సభ విజయవంతంపై చర్చించారు. కేసీఆర్ పాల్గొనే ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ మనోరమ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, వైస్ ఎంపీపీలు జె.అనంతరెడ్డి, గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అర్జున్‌రావు, శంకర్, జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, నాయకులు ఖలీల్, పత్యానాయక్, శంకర్, నిరంజన్‌గౌడ్, గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, లాలయ్యగౌడ్, పరమేశ్, వెంకటయ్య, రమేశ్, టి.రామకృష్ణ, రఘు, సులోచనసాయిలు, బి.గోపాల్ పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్ 'ఎ' ద్రావణాన్ని తాగించాలి

మాడ్గుల, ఫిబ్రవరి 12: చిన్న పిల్లలకు కంటి చూపు బాగుండేందుకు, అలాగే వ్యాధి నిరోధకశక్తి కోసం విటమిన్-ఎ ద్రావణాన్ని తప్పక తాగించాలని మాడ్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మోహన్ తెలిపారు. సోమవారం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో డాక్టర్ మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో 9 నెలల నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలకు ఏఎన్ఎం, ఆశాలు విటమిన్-ఎ సిరప్‌ను తాగించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందించు కునేందుకు చిన్నప్పుడే ప్రభుత్వం సూచించే అన్ని రకాల మందులను డోస్‌ల వారీగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్విన్ వైద్యాధికారి రఘురాం, హెచ్ఈవో దయాకర్, తహసీల్దార్ నిరంజన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

షాబాద్, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో బొడ్రాయి బోనాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి బోనాల ఊరేగింపు ప్రారంభమైయింది. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకులు కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును ఆలయం వరకు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులందరినీ చల్లగా, సుఖసంతోషాలతో చూడాలని మహిళలు బొడ్రాయికి బోనాల నైవేద్యాన్ని సమర్పించారు. బోనాలతో గ్రామంలో పండుగ నెలకొంది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రామస్థులు చంద్రారెడ్డి, రాఘవేందర్ గుప్తా, సత్యనారాయణగౌడ్, రవి, రాజు గౌడ్, శ్రీరాములు, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.


హైతాబాద్‌లో బోనాలతో బొడ్రాయి వద్దకు బయల్దేరుతున్న గ్రామస్తులు

సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేద్దాం


కందుకూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

కందుకూర్, ఫిబ్రవరి 12 :సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరాథోడ్, ఉపాధ్యక్షుడు భీమ్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కందుకూర్‌లోని ఆర్డీవో, పోలీస్ కార్యాలయాల అధికారులతో కలిసి ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. కందుకూర్ మండలంలో ఉన్న తండా ప్రజలందరూ ఏకమై సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర రాజునాయక్, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బి.బాలునాయక్, మేఘవత్ మాణిక్యంనాయక్, విస్లావత్, శ్రీను నాయక్, రవి, భాస్కర్, హరిలాల్, భీమ, గోవర్ధన్, కిరణ్, రమేష్, వంశీ, శ్రీకాంత్, శ్రీను, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.8.21కోట్లు మంజూరు : ఎమ్మెల్యే

ఆమనగల్లు, ఫిబ్రవరి 12 : ఉపాధి హామీ పథకం కింద కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. నాలుగు మండలాల పరిధిలో 165సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.8.21కోట్లు కేటాయించినట్లు ఆయన వివరించారు. ఆమనగల్లులో సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. 2023-24 సంవత్సరానికి ఈజీఎస్‌లో తలకొండపల్లి మండలంలో 58 సీసీ రోడ్లకు రూ.2.85కోట్లు, కడ్తాల మండలంలో 43 సీసీ రోడ్లుకు రూ.2.2కోట్లు, మాడ్గుల మండలంలో 51సీసీ రోడ్లకు రూ.2.6కోట్లు, ఆమనగల్లు మండలంలో 13సీసీ రోడ్లకు రూ.65లక్షల చొప్పున కేటాయించినట్లు వివరించారు. రెండో విడత మరికొన్ని గ్రామాలకు సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ప్రజా పాలనలో వివక్షకు తావులేకుండా అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్లు లేని మారుమూల గ్రామాలు, తండాలకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేసి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధిలో రాజకీయాలకు చోటులేకుండా ప్రజలంతా పాలు పంచుకోవాలని ఆయన కోరారు. ఇదిలా ఉంటే ఆమనగల్లు మండలంలో 13సీసీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్‌బాబ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో ఇర్విన్ విద్యార్థుల ప్రతిభ

మడ్గుల, ఫిబ్రవరి 12: ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొనే విద్యార్థుల ఎంపిక కోసం హైత్‌నగర్ జెడ్పీ పాఠశాలలో సోమవారం పోటీలు నిర్వహించారు. ఇర్విన్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి అశ్విని డ్రాయింగ్‌లో సెకండ్ ప్రైజ్, పాటల పోటీలో అంజలి సెకండ్ ప్రైజ్ గెలిచారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పర్వతాలు, టీచర్లు నాగమణి, సుధారాణి, వెంకటయ్య, మొగులయ్య, సుజాత, విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

శంకర్‌నాయక్‌కు ఘన సన్మానం

కడ్తాల్, ఫిబ్రవరి 12: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో జాతీయస్థాయి సేవా పురస్కారాన్ని అందుకున్న మండలంలోని గాన్గుమర్ల తండాకు చెందిన గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణవత్ శంకర్‌నాయక్‌కు సోమవారం కడ్తాల్‌లో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తార ఆర్ట్స్ అకాడమీ నుంచి అవార్డు అందుకున్న శంకర్‌ను నాయకులు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. సమాజానికి శంకర్ అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలాల్ నాయక్, దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, అధికార ప్రతినిధి జర్పుల లక్ష్మణ్, రాష్ట్ర కో-కన్వీనర్ రెడ్యనాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మన్య, గిరిజన మోర్చా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, శేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.


శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఏఎంసీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

షాద్‌నగర్, ఫిబ్రవరి 12: మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి చేయడం అమానుషం అని జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. సోమవారంఆయన షాద్‌నగర్‌లో మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఉండటాన్ని ఓర్వలేకే దాడి చేశారని ఆరోపించారు. తూకంలో మోసం, గిట్టుబాటు ధరకు రైతులు చైర్‌పర్సన్‌కు లేదా కార్యదర్శికి ఫిర్యాదు చేయాలేగానీ దాడి సరికాదన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేయాలన్నారు.

'కాంగ్రెస్ హామీలన్నీ అమలు చేస్తుంది'

కందుకూర్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని పూలిమామిడి బూత్ కమిటీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం గృహజ్యోతికి కావాల్సిన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. గృహజ్యోతి కోసం ట్రాన్స్‌కో అధికారులు అడిగే వివరాలు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నల్లగొండ సభను విజయవంతం చేయాలి'

ఆమనగల్లు, ఫిబ్రవరి 12: కృష్ణా పరీవాహక ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు అప్పగించడాన్ని నిరసిస్తూ, కృష్ణా జలాల పరిరక్షణకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు నల్లగొండలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాల్‌రాజ్ కోరారు. బీఆర్ఎస్ ఏ పక్షంలో ఉన్నా ప్రజల పక్షమేనని, ప్రజాసమస్యలపై పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. సోమవారం ఆమనగల్లులో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ అధ్యక్షతన నల్లగొండ సభపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బాల్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై జడ్పీటీసీ అనురాధతో కలిసి 'చలో నల్లగొండ' సభ కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాక నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, రమేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, లాలయ్యగౌడ్, పంతూనాయక్, సోనశ్రీనునాయక్, డేరంగుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి

కడ్తాల్, ఫిబ్రవరి 12 : అంకితభావంతో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అభిమానం చూరగొంటారని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. పనితీరును బట్టే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు, కీర్తి లభిస్తాయని తెలిపారు. ఇక్కడ మూడు సంవత్సరాలు పనిచేసి బదిలీ అయిన ఎంపీడీవో రామకృష్ణకు సోమవారం మండల పరిషత్‌లో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, ఉద్యోగులు రామకృష్ణను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి బదిలీ

చేవెళ్ల, ఫిబ్రవరి 12: రాజేంద్రనగర్ డీసీపీ పరిధి చేవెళ్ల, రాజేంద్రనగర్, నర్సింగ్ ఏసీపీలను సోమవారం ప్రభుత్వం బదిలీ చేసింది. చేవెళ్ల ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి హైద్రబాద్‌లోని ఐటీ సెల్‌కు బదిలీ అయ్యారు. కమాండ్ కంట్రోల్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బంటు కిషన్‌ను చేవెళ్ల ఏసీపీగా నియమించారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ఏసీపీలు గంగాధర్, పి.రాంచంద్రర్‌రావులను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. నార్సింగ్ ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు.

ఘనంగా బాలాజీసింగ్ జన్మదిన వేడుకలు


జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు/మాడ్గుల, ఫిబ్రవరి 12: పీసీసీ ఉపాధ్యక్షుడు, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మైసిగండి, ఆదిబట్లలోని ఆయన నివాసాల వద్ద నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, పార్టీలు, సంఘాల నాయకులు, జేఏసీ నేతలు పాల్గొన్నారు. బాలాజీసింగ్ కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బాలాజీసింగ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నేతలు మల్లు రవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు కమ్లీమోత్యానాయక్, అనితవిజయ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరునగరి వేణుగోపాల్, నర్సింహ, కేశవులు, సంజీవ్‌కుమార్, జంగయ్య, జగన్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం, బిచ్యానాయక్, భూపతిరెడ్డి, బి.ఆనంద్, విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, శేఖర్‌గౌడ్, కృష్ణ, వెంకటయ్యగౌడ్, జహంగీర్, వెంకటేశ్, చందోజీ, పాండు, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు. అలాగే మాడ్గుల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ వెళ్లి బాలాజీసింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, మిద్దె రాములు, విష్ణుదేవయ్య, సురేష్, వినవీణ్‌గౌడ్ ఉన్నారు.

పాఠశాలలకు దాతలు చేయూతనివ్వాలి


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న కసిరెడ్డి రాంరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కసిరెడ్డి రాంరెడ్డి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. సామాజిక సేవ, ప్రజాచైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీపడాలన్నారు. చంద్రాయన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి రాంరెడ్డి ప్లేట్లు, గ్లాసులు సమకూర్చారు. సోమవారం క్లబ్ సభ్యులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పురుషోత్తంరెడ్డి, యాదిరెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జె.రమేశ్, సభ్యులు కొండల్‌రెడ్డి, నర్సింహ, పీఆర్వో పాషా, కోశాధికారి వెంకటయ్య, టీచర్లు జ్యోతిర్మయి, కవిత, శిరీష, పీఎస్ రవీందర్ ఉన్నారు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం


వినియోగదారుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈ నరేందర్

షాబాద్, ఫిబ్రవరి 12 : ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హైతాబాద్‌లో గృహజ్యోతి పథకానిని విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకాన్ని పేద వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీటర్ రీడింగ్ తీసే సిబ్బందికి వినియోగదారులు ఆధార్/రేషన్ కార్డు, ఫోన్ నంబర్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ నరేందర్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు విధిగా దరఖాస్తు చేసుకోవాలి

యాచారం, ఫిబ్రవరి 12:పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డీఈ యాదగిరి తెలిపారు. సోమవారం మాల్‌లో ఆయన వినియోగదారులతో మాట్లాడారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల కాపీలు, ఫోన్‌నంబర్, మీటర్ బిల్లు అందజేయాలన్నారు. వివరాలను ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఏఈ సందీప్, గ్రామస్తులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో.. కాషాయ జెండా ఎగరవేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్, ఫిబ్రవరి 12: మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగరవేయాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రభారి కొత్తకాపు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో కార్యాకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషిచేస్తే బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్ గుప్తా, నరసింహ, శ్రీనివాస్, వంశీకృష్ణ, వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్, రుషికేష్, కొమరబండ శ్రీశైలం, ఎం.మురళి, మధుసూధన్‌గౌడ్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 12: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని సోమవారం ఆమనగల్లు వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్ మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తిలో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని నిరంజన్‌రెడ్డి సూచించినట్లు చెప్పారు. సతీష్, సుమన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం


ఇంట్లో కాలిపోయిన సామగ్రి


ఆర్థికసాయం అందజేస్తున్న పూజారి

చేవెళ్ల, ఫిబ్రవరి 12: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమైన సంఘటన సోమవారం చేవెళ్లలోని భగత్‌సింగ్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సన్నాయి రాధిక కుటుంబీకులు పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారింట్లో షార్ట్‌సర్క్యూట్‌తో సామాన్లు కాలిపోయాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అధికారులు చేరుకొని మంటలార్పారు. అగ్ని ప్రమాదంతో పేద కుటుంబం రోడ్డున పడడంతో దాతలు చేయూతనిచ్చారు. మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి రూ.20వేలు, ఆలయ అర్చకులు శ్రీకాంత్ చారి, శ్రీపాద్ రూ.10వేల సాయం అందించారు. మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ రూ.5వేల సాయం చేసి బాధితులను ఓదార్చారు.